నరరూప రాక్షసులు

భీమవరపు పురుషోత్తం

ఉదయం తొమ్మిది గంటలు దాటింది—

కాలకృత్యాలు ముగించుకొని ఫ్రెష్‌గా టీ తాగుతూ షిప్ డెక్ మీదికి మెల్లగా నడుస్తూ వచ్చాడు కిరణ్. ఖడ్గమృగంలా దృఢంగా వున్న ఇండియాకు చెందిన ఆ పాసింజర్స్ షిప్ సముద్రాన్ని చీల్చుకొంటూ తాపీగా సాగిపోతూంది ఆస్ట్రేలియా వైపు.

డెక్ మీదికి అప్పుడే పది, పదిహేనుమంది ప్రయాణీకులు చేరారు. అంతా తలో మూల ఉన్నారు. కొందరు చిన్న చిన్న కేన్ కుర్చీల్లో కూర్చుని యేదో మాట్లాడుకొంటున్నారు. కొందరు డెక్ అంచు దగ్గర నిలబడి అంతులేని జలాన్ని, పైన ఎగురుతున్న పక్షుల్ని చూస్తున్నారు.

కిరణ్ ఖాళీగా ఉన్న ప్రదేశాన్ని చూసుకొని, అక్కడికి నడిచాడు. విసురుగా వచ్చిన గాలితెర అతడి వత్తయిన జుత్తును చెరిపేసింది. జుత్తును అలాగే నిర్ల

క్ష్యంగా వదిలి, అంచు దగ్గరకు చేరి నీటివంక చూస్తూ టీ త్రాగడం పూర్తిచేశాడు.

"హలో కిరణ్ ఇక్కడున్నావా?"

చటుక్కున తలతిప్పాడు కిరణ్. కెప్టెన్ రాజేంద్ర సింగ్ నవ్వుతూ వస్తున్నాడు.

చిన్నగా నవ్వాడు కిరణ్ "ఏమిటీ పొద్దుటే కెప్టెన్ గారికి నన్ను పలకరించేటంత ఖాళీ వచ్చిందా!"

కెప్టెన్ రాజేంద్రసింగ్ సిక్కు. ఆరడుగుల ఎత్తు చురుకయిన కళ్ళతో కెప్టెన్ అన్న పదానికి తగ్గట్టుగా ఉంటాడు. "ఇవాళ పెద్దగా పనిలేదు" చెప్పాడు సింగ్.

షిప్ కెప్టెన్ వంక నవ్వుతూ, చనువుగా మాట్లాడుతున్న కిరణ్ వంక దగ్గరలో వున్న వాళ్ళు కొందరు ప్రత్యేకంగా చూశారు.

"ఇంకా ఎన్నిరోజులు పడుతుంది మనం గమ్యం చేరడానికి?"

"ఏం అప్పుడే బోర్ కొడుతుందా షిప్ లైఫ్, మరో పదిరోజుల్లో ఆస్ట్రేలియా చేరుకొంటాం" అన్నాడు సింగ్.

చిన్నగా నవ్వి చెప్పాడు కిరణ్ "మొదట రెండు రోజులు రకరకాల దేశాల ప్రయాణీకులతో పరిచయాలు, శబ్దకాలుష్యంతో నిండివుండే నగర జీవితంలా కాక ప్రశాంత వాతావరణం, చల్లని సముద్రపు గాలి ఎంత చూసినా తనివితీరని సముద్రపు అందాలతో ఉల్లాసంగా గడిచిపోయాయి. కానీ రాను రాను యేదో అనాసక్తి, ఒంటరితనం ఫీలవ్వక తప్పడంలేదు."

"షిప్‌లో దూరప్రయాణం చేసే ప్రతి ప్రయాణీకునికి

ఎదురయ్యే సమస్య ఇది" అని గొంతు తగ్గించి, తగ్గు స్వరంగా అడిగాడు సింగ్, "అన్నట్టు నువ్వు ఆస్ట్రేలియా వెళ్ళేది, అక్కడ ప్రత్యేక శిక్షణ తీసుకొంటున్న మా యేజెంట్ల ప్రోగ్రస్ చెక్ చెయ్యడానికేనా లేక అంతర్గతంగా యేదయినా కారణం ఉందా?" కిరణ్ ఇంటెలిజెన్స్ డిపార్టుమెంట్ ప్రత్యేక గూఢచారి అన్న విషయం తెలిసిన వ్యక్తి షివ్ లో సింగ్ ఒక్కడే.

"సింగ్, అలాంటిదేమయినా వుంటే నీకు చెప్పనా, ఇండియాలో నీకంటె ముఖ్యమైన స్నేహితులు యెవరున్నారు చెప్పు నాకు!"

"ఓకే.... ఓకే.... సందేహం వచ్చి అడిగానంతే" అని, టైమ్ చూసుకున్నాడు సింగ్. "కంట్రోల్ రూమ్‌కి వెళ్ళాల్సిన పని మా ఛీఫ్, అక్కడ గత రెండురోజులుగా యేదో డిఫెక్టు కన్పిస్తూందని చెబుతున్నాడు, మధ్యాహ్నం రూమ్‌కొస్తా వీలుంటే" అని హడావిడిగా వెళ్ళిపోయాడు.

2

సన్నటి పొడుగాటి కారిడార్‌లో నడుస్తున్నాడు కిరణ్. కారిడార్‌లో వుడ్‌తో నిర్మించిన గదులు యెడంవయిపు పొడుగునా వున్నాయి. కుడివయిపు కొంతవరకే ఉన్నాయి గదులు. ప్రక్కన కంట్రోల్ కనెక్షన్ రూమ్ ఆపై స్టోర్స్ గదులు.

బాగా రాత్రి అవడంవల్ల కారిడార్‌లో చాలావరకూ దీపాలు ఆర్పేశారు. అన్ని గదుల తలుపులు మూసి ఉన్నాయి. జాగ్రత్తగా వింటే కొన్ని గదుల్లోంచి సన్నగా మాటలు వినబడుతున్నాయి.

కిరణ్ కుడివయిపు వరసలో ఆఖరి రూమ్ సమీపిం

చాడు. మరో ఆరడుగులు నడిస్తే ఎడంవయిపు అతని రూమ్ వస్తుంది.

ఆఖరి రూమ్ దాటుతుండగా అతడి చెవికి స్పష్టంగా వినిపించింది ఎలక్ట్రానిక్ శేవ్!? 'బీ....స్ స్ స్'మంటూ.

సర్వసాధారణంగా ఎవరూ పట్టించుకోరు అలాంటివి. కిరణ్ కి పుట్టిన సందేహం ఒక్కటే అక్కడ అలాంటి శబ్దాలు కంట్రోల్ కనెక్షన్ రూమ్నుండి రావడానికి మాత్రమే ఆస్కారం ఉంది. కానీ ఆ రూమ్ స్టీల్ తలుపులు పూర్తిగా లాక్ చేయబడి వున్నాయి—మరి యెక్కడనుం....

చిన్న శబ్దంతో ఆఖరి రూమ్ తలుపు తెరుచుకొంది. సూక్ష్మంగా చూశాడు కిరణ్ అటువైపు.

తలుపు తెరిచిన వ్యక్తి కిరణ్ని చూసి అవాక్కయి తలుపు వేసేశాడు. తలుపు తెరవడానికి మూయడానికి దాదాపు మూడు క్షణాల పైనే పట్టింది.

అది చాలు కిరణ్ కి. అతడి చురుకైన చూపు, ఆ వ్యక్తిని దాటి వెనగ్గా వెళ్ళి, కాస్త గోధుమ రంగులో అక్కడక్కడ చిన్న చిన్న లైట్లు వెలుగుతున్న ఓ రౌండ్ టేబుల్ లాంటి వస్తువు పైపడింది. దానిని పరిశీలించే లోపే మూసుకుంది తలుపు.

అన్యమనస్కంగా తన రూమ్కి వెళ్ళి పడుకున్నాడు కిరణ్. అతడి శరీరం పూర్తిగా అలసిపోయింది. కళ్ళు మూసుకొన్నాడు. తలుపు తెరుచుకోగానే ముందు తన దృష్టిలో పడిన రూపాన్ని గుర్తుతెచ్చుకోసాగాడు.

పొట్టిగా లావుగా తెల్లగా వున్నాడతను. ముఖ్యంగా క్రిందిరెప్పలు బరువుగా సాగివున్న ఎద్దు కళ్ళు వాడివి.

ఎందుకో లేచి, ఆ విషయం సింగ్ కి చెబుదామా?

అనిపించింది కిరణ్ కి. కానీ, చిన్న విషయానికి అంత ప్రాముఖ్యత ఎందుకులే అని ఊరుకొని, నిద్రలోనికి జారుకున్నాడు

అతను తీసుకొన్న ఆ నిర్ణయానికి ఫలితం సుమారు ఆరుగంటల తరువాత అత్యంత భయానకంగా ఎదురవ్వబోతుందని అతడికేం తెలుసు!?

3

హఠాత్తుగా మెలకువ వచ్చింది కిరణ్ కి!?

చప్పున లేచి కూర్చున్నాడు. అతడికి మాటల్ల స్పష్టంగా తెలుస్తుంది. కేకలు అరుపులు, తుపాకీ చప్పుళ్ళు కలగాపులగంగా వినిపిస్తున్నాయి.

గట్టి వస్తువుతో అతడి గది తలుపులు బాదుతున్నారు ఎవరో!?

లూజుగా వుండే చారల నైట్ డ్రస్ లో వున్నాడు కిరణ్. ఏదో ప్రమాదం క్రమ్ముకొస్తుందని అర్థమౌతోంది అతడికి. వేగంగా కదిలాడు. మూలవున్న చెక్క తలుపు లాగాడు. అందులోనుండి వైర్ లెస్ ట్రాన్స్ మీటర్ కమ్ ఆటోమేటిక్ కంప్యూటర్ తీసి జేబులో వేసుకున్నాడు.

అప్పటికే పెళ్ళున విరిగిపోయింది గది తలుపు సగానికి. ఆ ఖాళీలోనుండి నల్లటి గండ్రగొడ్డలి లోపలికి వచ్చింది. కిరణ్ విస్మయంగా చూస్తున్నాడు.

వికటంగా నవ్వుతున్నాడు విరిగిన తలుపులోనుండి కనిపించే వ్యక్తి నల్లగా దృఢంగా వున్నాడతను తుప్పలాంటి జుట్టుకి అడ్డంగా బలంగా కట్టిన గుడ్డముక్క. మెడదగ్గర 'వి' షేపులో కత్తిరించబడిన నల్లటి మాసిపోయిన బనియన్.

మిగిలిన తలుపు ఒక్క వేటుతో నరికేసి లోపలికి వచ్చేశాడు. అతడి బనియన్ మీద రొమ్ముకి కాస్త క్రిందగా తెల్లగా పన్నెండు అనే నంబరు వేసివుండడం గమనించాడు కిరణ్.

కిరణ్ వెనక్కి పడుతూ తనకు కావలసిన విధంగా పొజిషన్ కి వచ్చాడు. కుడిచేయి టీపాయ్ మీదకు జరిపాడు. ఎదురుగా ఉన్న ఆ వ్యక్తి హేళనగా నవ్వుతూ, చేతిలో గొడ్డలి ఒడుపుగా కదుపుతున్నాడు. ఏ క్షణాన్నయినా దాన్ని విసిరేలా వున్నాడు.

కిరణ్ చేతికి కావలసిన వస్తువు అందింది. అది అరచేతిలో సగం పరిమాణంలో ఉండే ఆధునికమైన రివాల్వర్. శత్రువు ప్రాణాలు రవ్వాత బుల్లెట్ తో తీసే ప్రమాదకరమైన మారణాయుధం!

అంతవరకూ మన్నుతిన్న పాములా మెల్లగా వెనక్కి వెళ్ళిన కిరణ్ హఠాత్తుగా మెరుపులా కదిలాడు. కాలితో టీపాయ్ ని వెనక్కి తోసి, మోకాలిమీద వంగి పేల్చాడు రివాల్వర్.

ఎలాంటి శబ్దం లేకుండా బులెట్ ఆ వ్యక్తి పొట్టలో తగిలింది. శత్రువు ముఖంలో నవ్వు మాయమయింది. రక్తంతో తడిసిపోతూంది బనియన్.

“క్రాక్” మంటూ బిగ్గరగా అరిచి గొడ్డలి గాల్లోకి ఊపాడు. గాయంవల్ల గొడ్డలి వేగం చాలావరకు తగ్గింది. అప్పటికే కిరణ్ బెడ్ మీదకి వంగి తప్పుకున్నాడు. కిరణ్ జేబులో ఉన్న ట్రాన్స్మీటర్ కి తగిలింది గొడ్డలి.

రెండోసారి గొడ్డలి లేపాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. భీకరంగా అరవడం తప్ప ఏం చేయలేక పోతున్నాడు ఆ వ్యక్తి. బులెట్ పని చేయసాగింది. ఆ

వ్యక్తి కడుపు దగ్గర గాయం పెద్దదై పోతూంది పుస్తకం మీద పడ్డ యాసిడ్ లా. అతడి దేహాన్ని కాల్చుకుంటూ పోతూంది బులెట్.

కారిడార్ లోనికి వచ్చేశాడు కిరణ్. కకావికలై పోతున్నారు ప్రయాణీకులు. బందిపోట్లు చాలామందిని చంపేశారు. కొంతమందిని అప్పుడే చంపుతున్నారు. తుపాకులతో, గొడ్డళ్ళతో, బరిసెలతో స్వైరవిహారం చేస్తున్నారు దొంగలు.

గంట క్రితం వరకూ ప్రశాంతంగా ప్రయాణించిన ఆ ఓడ ప్రస్తుతం రక్తంతో తడుస్తూంది.

ఒడుపుగా తప్పించుకుంటూ, బాణం లా పరిగెడుతున్నాడు కిరణ్. హఠాత్తుగా ఓ చెయ్యి అతడిని గది లోనికి లాగింది.

4

"సింగూ నువ్వా?" అన్నాడు కిరణ్ ఆనందంగా. సింగ్ క్షేమంగా ఉండడం అతడికి సంతోషాన్ని కలిగించింది.

స్టీల్ తలుపులు లాక్ చేసేస్తూ చెప్పాడు సింగ్ "లక్కీగా వచ్చావు సమయానికి. జాగ్రత్తగా పారిపోవాలి. మన షిప్‌ను వాళ్ళు పూర్తిగా ఆక్రమించేశారు."

"మా రక్షణ సిబ్బంది అంతా ఏం చేస్తున్నారు?" ఉక్రోషంగా అడిగాడు కిరణ్.

తేరిపార చూశాడు సింగ్. "షిప్‌లో ఇంత బీభత్సం జరుగుతూంటే కెప్టెన్ నయిన నేను ఇలా తప్పించుకొని పారిపోవాలనుకోవడం, చిత్రంగా అనిపిస్తుంది కదూ నీకు — తెల్లవారుజామునే యెవరూ ఊహించనంత హఠాత్తుగా దాడిచేశారు వాళ్ళు. సిబ్బంది అప్పటికి

ఎలర్ట్ గా లేరు. అలారమ్స్ మ్రోగి సిబ్బంది పొజిషన్ కి వచ్చేసరికి, సగంమందిని చంపేశారు వాళ్ళు నరరూప రాక్షసులు వాళ్ళు. వాళ్ళతో పోరాటం అంటే కావాలని ఊబిలో మునిగినట్టే" ఒగరుస్తూ చెప్పాడు సింగు.

తలుపులు బాదుతున్నారు అవతల. ఇద్దరూ వేగంగా కదిలారు. అప్పుడప్పుడు ప్రేలుళ్ళు వినబడుతున్నాయి.

"మై గాడ్. ఎక్స్‌ప్లోజివ్స్ కూడా ఉపయోగిస్తున్నారు" గొణిగాడు సింగ్.

ఇద్దరూ గదిమధ్యలో అండర్ ఎస్కేప్ రూమ్స్ కి మార్గంగా వున్న వెడల్పాటి రంధ్రంలోనికి దిగసాగారు. సింగ్, కిరణ్ వెనుకగా దిగి, గుండ్రటి ఇనుప తలుపు రంధ్రంపై మూసి వేసి లాక్ చేసేశాడు.

క్రింద చాలావరకూ చీకటిగా ఉంది. అక్కడక్కడా మినీ బల్బులు వెలుగుతున్నాయి. "ఇటు పద" అన్నాడు సింగు టార్చి వెలిగించి. అత్యంత ప్రకాశవంతంగా వున్న టార్చి వెలుగులో చుట్టూ చూస్తూ నడిచాడు కిరణ్. అర్థంకాకుండా బిగించబడి వున్న ఇనుపగొట్టాలు, తుప్పు పట్టిన లావాటి గొలుసులు. పెద్ద చెక్క డ్రమ్ములతో విశాలంగా వున్నాయి ఆ గదులు.

ఎదురుగా ఉన్న రూమ్ ఓపెన్ గా ఉండటంతో టార్చి ఆర్పేశాడు సింగ్. తెల్లబోయాడు కిరణ్ అక్కడ చూసి.

నలుగురు ప్రయాణీకులు ఉన్నారక్కడ లైఫ్ బోట్ సిద్ధంచేస్తూ. యంత్రంతో నడిచే ఖరీదైన లైఫ్ బోట్ అది.

అందులో ఒక వ్యక్తి సింగ్ వంక చూసి చెప్పాడు.

"కెప్టెన్-ఇక మనం తొందరగా వెళ్ళిపోవడం మంచిది"

మిగతావాళ్ళు కిరణ్ వంక ఆసక్తిగా చూస్తున్నారు.

అప్పటికే బోట్ స్టార్టయింది. కిరణ్ ముందు తామిద్దరమే ఎస్కేప్ అవుతున్నాం అనుకున్నాడు. సింగ్ కెప్టెన్ గా, కనీసం నలుగురు ప్రయాణీకులనయినా రక్షించినందుకు సంతోషించాడు.

బోట్ లో ఎక్కి కూర్చున్నాడు. చాలా పెద్ద బోట్ అది. అందరూ హాయిగా కూర్చోవచ్చు. కాసేపటికి చూసాడు కిరణ్ — బోట్ లో ఒక స్త్రీ కూడా ఉండడం. పాంట్, షర్టులో ఉండడంతో ముందు చూసినప్పుడు గుర్తించలేకపోయాడు. ఏడుస్తున్న ఆమెను ప్రక్కనున్న వ్యక్తి ఊరడిస్తున్నాడు.

సింగ్ బోట్ ఫ్యూయల్ చెక్ చేసి, ఏ దిశగా వెళ్ళవలసింది డయల్ లో చూస్తున్నాడు.

వాళ్ళంతా బోటులో ఎక్కిన రెండు నిమిషాలకు, షిప్ కి అడుగున నీటి మట్టానికి సమంగా ఉన్న చిన్న షెడ్ లాంటి ఓపెన్ స్పేస్ నుండి బోటు నీటిలోనికి ఉరికింది. నీటిని తాకగానే కుదుపుకి అంతా కూలి పడబోయారు.

క్రింద నీళ్ళల్లో గుండెలు జలదరించే దృశ్యం చూశారంతా. ఎంతోమంది ప్రయాణీకులు చిత్రవధ చేయబడి, క్రిందకు విసిరివేయబడి నీళ్ళలో తేలుతున్నారు. కొంతమంది బందిపోట్లకు భయపడి నీటిలో ఉరికి, ప్రాణం పోగొట్టుకొన్నారు. నీరంతా ఎర్రగా మారి ఉంది ఆ ప్రదేశంలో.

"కెప్టెన్ ఇక్కడ చూడండి" అన్నాడొక వ్యక్తి, బోటు కొద్ది దూరం వచ్చాక అంతా పైకి చూశారు తటాలున.

ఇద్దరు దొంగలు షిప్ అంచున చిన్నగా కనబడు
తున్నారు. కల్లు తాగిన కోతుల్లా గెంతుతున్నారు, బోట్ ని చూస్తూ. ఎత్తుగా ఆకాశంలోనికి ఉన్నట్టున్న, షిప్ అంచు మీదనుండి వచ్చే వాళ్ళతిట్లు విపరీతమైన గాలికి చెల్లాచెదరుగా, అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"మిగతా వాళ్ళను కూడా పిలుస్తారేమో?" అన్నాడు సింగ్.

బోటుకి కొద్ది దూరంలో రాళ్ళు పడేసినట్టు నీళ్ళు పైకి లేచాయి నాలుగయిదు చోట్ల.

"రైఫిల్స్ పేలుస్తున్నారు" చెప్పాడు, సింగ్ ప్రక్కన కూర్చున్న వ్యక్తి.

బోటు నడుపుతున్న వ్యక్తి కంగారుగా చెప్పాడు "గ్రెనేడ్స్ కూడా విసిరారంటే మరింత ప్రమాదం. బోటుకి తగిలితే అంతా నీటిపాలవుతాం."

యువతి కళ్ళు విప్పార్చుకొని భయంగా చూస్తుంది. ఆమె కళ్ళలో ప్రాణభయంలేదు - తనవాళ్ళను పోగొట్టుకొన్న బాధ, ఆవేదన తప్ప.

బోటులో ఒక రైఫిల్ ఉంది. సింగు దానిని గురి చూసి రెండు రౌండ్లు పేల్చాడు పైకి.

"దాని రేంజ్ కి అంత దూరం అందదు. పైగా సూటిగా పైకి పోవాలంటే మరీకష్టం" చెప్పాడు కిరణ్.

కిరణ్ మాటలు పూర్తవ్వకుండానే బోటుకి ఎడం వయిపు కాస్త దూరంలో 'దబ్'మన్న శబ్దంతో పాటు అంతెత్తున లేచాయి నీళ్ళు.

అలల తాకిడికి బోటు, తాపీగా ఏటవాలుగా వరిగి మరలా యథాస్థితికి వచ్చింది. పైకిలేచిన నీళ్ళు బోటులో పడ్డాయి. దాదాపు మునిగిపోయినట్టు బోటు వరగగానే,

యువతి 'కావ్య'మని అర్చింది. మిగతా వాళ్ళు బోటు అంచులను పట్టుకొని ఉండిపోయారు భయంగా.

"అనుకున్నంతా అయింది" కృంగిపోయాడు సింగ్.

ఉపేక్షించలేదు కిరణ్. తన రివాల్వర్ తీసి, జాగ్రత్తగా గురిచూసి పైకి పేల్చాడు. అది గురి తప్పిందని పేల్చగానే అర్థమైంది కిరణ్ కి. మరోసారి షూట్ చేద్దామనుకొన్నాడు.

సరిగ్గా పేల్చిన మూడు క్షణాలకు షిప్ అంచుమీద, పెద్ద మంటతోపాటు ప్రేలుడు వినిపించింది. బుల్లెట్ శత్రువు విసరబోయే గ్రెనేడ్ కి తగిలిందని గ్రహించాడు కిరణ్. అంతా ప్రశంసాపూర్వకంగా చూశారు కిరణ్ వైపు. సింగ్ మిత్రుడి భుజం తట్టాడు.

బోటు వేగం పెరిగింది. లైఫ్ బోటు ఉంచిన అండర్ రూమ్స్ లోనికి కూడా దొంగలు చొచ్చుకొని వచ్చారు. ఓపెన్ రూమ్ లో నిలబడి, కాల్పులు జరిపారు. అప్పటికే చాలా దూరం వెళ్ళిపోయింది బోటు. షిప్ క్రమేణా దూరం కాసాగింది.

"అదిగో ఆ రాస్కెల్స్ షిప్" అరిచాడొక వ్యక్తి. అంతా చూశారు పరిశీలనగా. పాసింజర్స్ షిప్ వెనకగా, దానిలో సగం పరిమాణంలో ఉన్న, మరో షిప్ లాండ్ అయివుంది.

అరగంట తర్వాత పాసింజర్స్ షిప్ లో వినిపించింది పెద్ద విస్ఫోటనం. బోటులోని వాళ్ళు కూడా త్రుళ్ళిపడేటంత భయంకర శబ్దం అది.

పాసింజర్స్ షిప్ లో నాలుగోవంతు భాగం, తునాతునకలయి గాలిలోనికి లేచింది.

ఎవరూ ఊహించని సంఘటన. రెప్పకూడా వెయ

ఉండా ఏదో ఇంగ్లీష్ క్రైమ్ చిత్రం చూస్తున్నట్టు, టెన్షన్‌గా చూస్తున్నారు వాళ్ళు.

మొదటి విస్ఫోటం పూర్తికాగానే, రెండవ విస్ఫోటం వినిపించింది. నల్లటిపొగ ఉక్కు గొడుగులా లేచింది. సముద్రపు దొంగలు తాము దోచిన ఏ నౌకను సర్వ నాశనం చెయ్యకుండా వదిలిపెట్టరు. కేవలం దోచుకోవ డమే అన్నది వాళ్ళకు అంతగా సంతృప్తిని కలిగించదు!

పాసింజర్స్ షిప్ తుపాకీగుళ్ళకు గురయిన పార్క్ చేపలా, నీటిలో తునాతునకలయి కాసేపటికి మునిగి పోయింది.

సింగు కళ్ళల్లో నీళ్ళు ఊరడం చూశాడు కిరణ్. మిత్రుని చేయి, తన చేతిలోనికి తీసికొని ఓదార్పుగా నొక్కాడు.

బోటు సాగిపోతూంది వేగంగా. కిరణ్ ఆలోచనలలో మునిగిపోయాడు. తను బయల్దేరింది ఆస్ట్రేలియాలో శిక్షణ పొందుతున్న కొందరు యువ గూఢచారుల ప్రోగ్రెస్ గమనించడానికి. ప్రస్తుత పరిస్థితులు చూస్తే ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థంకావడంలేదు. ప్రాణాలతో ఏదో ఒక ఒడ్డుకు చేరగలిగితే చాలనిపిస్తూంది.

ఇంతలో అందరినీ ఉద్దేశించి చెప్పాడు సింగ్. "ఫ్రెండ్స్! మనమెంత ప్రమాదంలో ఉన్నామో ప్రత్యే కించి చెప్పవలసింది లేదు. ప్రవాహంలో గడ్డిపోచలా, ఈ మహాసముద్రంలో కొట్టుకొని పోతున్నాం. ప్రస్తుతం మన వద్ద అందరికీ సుమారు ఐదురోజులకు సరిపడా ఆహార పదార్థాలున్నాయి. ప్రాణాలు రక్షించుకొనే ప్రయ త్నంలో ఇంతకంటే ఎక్కువ ఆహారపదార్థాలు తీసుకొని రాలేకపోయాము....

15

....వాటినే జాగ్రత్తగా ఉపయోగించుకోగలిగితే, వారం రోజుల వరకూ రావచ్చు. మరో విషయం. మనకు దగ్గరగా ఉన్న ఒడ్డు పడమర. ఒడ్డు చేరాలంటే బోటులో సుమారు రెండువారాల వరకూ ప్రయాణం చేయాలి. శోచనీయం ఏమిటంటే బోటు నడపడానికి రెండువారాలకు సరిపడా ఫ్యూయల్ లేదు. నిజం చెప్పాలంటే మన దగ్గరున్న ఆయిల్ పూర్తిగా వారంరాదు.... అందువలన బోటును పగలంతా తెడ్లు వేసి నడపాలి. రాత్రిళ్ళు ఇంజన్‌తో నడుస్తుంది.

ఇటువంటి పరిస్థితిలో అంతా ధైర్యంగా కలసి కట్టుగా ఉండగలిగితే ప్రాణాలతో బయటపడడానికి ఆస్కారం వుంది. ఏది. ఏమయినా అంతా ఒక విషయం గుర్తుంచుకోవాలి. ప్రమాదం మనకు యెంతో దగ్గరగా వుంది."

సింగు చెప్పింది, తమ ప్రాణాలకు సంబంధించిన తీర్పు వినే ముద్దాయిల్లా ఊపిరకూడా పీల్చకుండా విన్నారంతా.

కాసేపటికి తేరుకొని అందరూ తమ తమ వివరాలు తెలియజేసారు.

5

సింగు ప్రక్కన కూర్చున్న వ్యక్తి విన్సెంట్. అమెరికన్. అతడొక్కడే ప్రయాణిస్తున్నాడు షిప్‌లో. పొట్టిగా పీలగా బాగా తెల్లగా ఉన్నాడతడు.

డ్రైవ్ చేస్తున్న వ్యక్తి హుయ్ చెయ్ హుయ్. చైనీస్. పొట్టిగా బలంగా వున్నాడతను. దొంగల దాడిలో తన భార్యను పోగొట్టుకున్నాడు.

ఏడుస్తున్న స్త్రీని ఓదార్చిన వ్యక్తి కార్ల్. అతడూ అమెరికనే. అతని వెంట వచ్చిన స్నేహితుడు దొంగలతో

పోరాడి మరణించాడు. వెడల్పాటి మొహంతో పొడుగ్గా హుందాగా ఉన్నాడతను.

యువతి పేరు ఫ్లోరా. స్పెయిన్ దేశస్థురాలు. ఆమె భర్తను పిల్లలను అతి దారుణంగా వధించారు దొంగలు. ఆ షాక్ నుండి ఇంకా కోలుకోలేదామె. ఆమె మొహంలో దుఃఖపు నీడలు ఆమె అందాన్ని దాచలేకపోతున్నాయి.

కిరణ్ కూడా తన వివరాలు చెప్పాడు. తాను ఆర్కియాలాజిస్ట్‌నని, ఆస్ట్రేలియాలో చారిత్రాత్మక కట్టడాలు చూడడానికి వెళుతున్నానని చెప్పాడు.

“గత రెండురోజులనుండి మా ఛీఫ్ కంట్రోలర్ షిప్ స్క్రీన్ మీద ఏదో డిఫెక్ట్ వస్తూందని ఆపరేటర్లందరికీ తెలియబరిచాడు. వాళ్ళతో పాటు నేనూ టెస్టు చేశాను....ఛీఫ్ చెప్పింది నిజమే. ఎవడో ద్రోహి షిప్‌లో నుండే బందిపోట్లకు మెసేజ్ అందిస్తూ, షిప్ ఏ దిశగా వెళుతున్నదీ, వాళ్ళు ఏ దిశగా రావలసినదీ సూచిస్తున్నాడు. అదే స్క్రీన్ మీద షిప్‌కి అడ్డుగా కనబడుతూంది. విషయం పూర్తిగా అర్థమయ్యే సరికి అంతా మించిపోయింది” విచారంగా చెప్పాడు సింగ్.

అంతా ఆసక్తిగా విన్నారు. కిరణ్ టెన్షన్‌గా కదిలాడు. అతడికి రాత్రి సంఘటన గుర్తొచ్చింది. వెంటనే తాను చూసింది వివరంగా చెప్పాడు అందరికీ.

“ఖచ్చితంగా వాడు దొంగల మనిషే అయుంటాడు. ఏదో వంకతో ప్రయాణీకుడిగా నౌకలో ప్రవేశించాడు. మెసేజ్ అందించాడు” అన్నాడు విన్సెంట్.

“అదే అయ్యుంటుంది. లేకపోతే సముద్రం మీద వెళ్ళే షిప్ రూట్ కనుగొనడం దొంగలకు అంత తేలిక కాదు” అన్నాడు సింగ్.

మిగతా వాళ్ళు ఏం మాట్లాడలేదు. మౌనంగా వుండి పోయారు.

కిరణ్ కి అకస్మాత్తుగా గుర్తొచ్చింది. జేబులో తడి మాడు. అతడి మొహంలో ఆనందం వెల్లివిరిసింది. వణుకు తున్న చేతులతో వైర్ లెస్ ట్రాన్స్మిటర్ బయటికి తీశాడు. అంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు కిరణ్ వంక, అతని చేతిలో వస్తువు వంక. సింగ్ అదేమిటో ఇప్పటికే గమనించేశాడు. కిరణ్ వంక చూసి నవ్వాడు చిన్నగా.

చూపుడు వ్రేలితో బటన్ నొక్కాడు కిరణ్. టక్కున వెలిగింది ఎర్రలైట్. చిత్రంగా అనిపిస్తుంది కిరణ్ కి. మృత్యువు నోటిదాకా వెళ్ళి తిరిగి వెనక్కి రాగలగడం.

మరో రెండు బటన్ లు నొక్కి చెప్పాడు "హలో.... హలో ...కిరణ్ స్పీకింగ్ ....కిరణ్ స్పీకింగ్, ఓవర్."

కిరణ్ చేతిలో వున్న ట్రాన్స్మిటర్ లోనుండి ఓ కంఠం వినిపించింది. "యస్ భరద్వాజ స్పీకింగ్ .... భరద్వాజ స్పీకింగ్ ....వాట్స్ ది మే ..."

ఊహించని విధంగా ఎర్రలైట్ ఆరిపోయింది. కిరణ్ కనుబొమ్మలు దగ్గరయ్యాయి. సింగ్ దగ్గరగా వంగాడు.

కొద్దిగా కదిపి చూశాడు యంత్రాన్ని చిన్న శబ్దం తప్ప లైట్ మళ్ళీ వెలగలేదు చమట్లు పడుతూండగా అన్ని స్విచ్ లు నొక్కి చూశాడు కిరణ్. అతడికి అర్థమైంది అది పని చెయ్యడంలేదు. బహుశా దొంగతో పోరాడినప్పుడు, వాడి గొడ్డలిదెబ్బ తగిలి పాడయి వుండవచ్చు.

"ట్రై చెయ్యి కిరణ్" అన్నాడు సింగు ఆశగా.

"లాభంలేదు. పాడయిపోయింది" అని సింగుకి అందిం

చాడు దానిని.

పదినిమిషాలు ట్రై చేశాడు సింగు. ప్రయోజనం లేక పోయింది సింగు నుండి తిరిగి యంత్రాన్ని తీసుకొన్నాడు కిరణ్. నీటిలోనికి విసిరివేయాలనుకున్నాడు దానిని. మళ్ళీ ఎందుకో మనస్కరించక జేబులో వేసుకొన్నాడు. ఆ రోజంతా మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాడు. కాని అది పని చేయలేదు.

ట్రాన్స్మిటర్ పని చెయ్యక పోవడంతో కొద్దిగా దెబ్బతిన్నాడు కిరణ్. చుట్టూ చూశాడు. కనుచూపు మేరలో ఎటు చూసినా నీరు. మబ్బులతో నిండిన ఆకాశం బాగా దగ్గరగా ఉన్నట్టుంది.

ఎందుకో నీరు ఆకాశం అనే రెండు ఇనుప పొరలమధ్య ఊపిరి అందకుండా అణిగిపోతున్నట్టు అనిపించింది కిరణ్‌కి.

మిగతా వాళ్ళ పరిస్థితికూడా అలాగే వుందని వాళ్ళ ముఖాలు చూసి చెప్పవచ్చు.

6

ఆరు రోజులు గడిచాయి — అదృష్టవశాత్తు అంత వరకూ ఏ ప్రమాదం లేకుండా ప్రయాణించారు వాళ్ళు.

తెల్లవారింది — ఉదయం ఆరున్నర అయింది.

చల్లటి ఈదురుగాలికి అందరికీ మెలకువ వస్తోంది.

కళ్ళు తెరిచిన కిరణ్ ఆశగా చుట్టూ చూశాడు. ఏదయినా దీవిలాంటిది కనుచూపు మేరలో కనబడుతుందేమోనని. నీరుతప్ప ఏం కనిపించలేదు.

మండిపోతున్న కళ్ళను స్వాధీనంలోనికి తెచ్చుకొంటున్నాడు కిరణ్. కాసేపాగి ఒళ్ళు విరుచుకొని తెడ్డు అందుకొన్నాడు.

సింగుని, హుయ్‌ని తట్టిలేపాడు "ప్లీజ్ ఎవరూ ఉద్రేకించకండి. కనీసం కొన ప్రాణాలతోనయినా ఒడ్డు చేరడానికి ప్రయత్నిద్దాం-" అన్నాడు.

"ఫుడ్‌టిన్స్ కొద్దిగానే ఉన్నాయి. గట్టిగా వస్తే ఎల్లుండివరకూ వస్తాయి" అన్నాడు హుయ్ టిన్స్ చెక్ చేస్తూ.

ఇంతలో సింగు, హుయ్‌ని ఉద్దేశించి "ఇంజన్ రాక్ అంతా ఒకసారి చెక్ చెయ్యి. నాకేదో అనుమానంగా ఉంది" అన్నాడు, గ్లాస్ పగిలివున్న దిక్కులు సూచించే డయల్ వంక అనుమానంగా చూస్తూ.

సింగు, కిరణ్ ఇద్దరే తెడ్లు వేయసాగారు. దాదాపు రెండుగంటల విశ్రాంతి తర్వాత మళ్ళీ కదిలింది బోటు. ఇంజన్ స్టార్ట్ చేశాడు హుయ్. మళ్లీ ఆఫ్ చేసి మిగతా మీటర్లు చూశాడు. ఫాల్టు ఏమీ కనిపించలేదతడికి.

చివరగా దిక్కులు సూచించే డయల్ మీద చేయి వేసాడు. గ్లాస్ పగిలి, కాస్త లూజ్‌గా ఉండడం చూసి, "బోటు దిశ మార్చండి" అన్నాడు.

సింగు, కిరణ్ తెడ్ల సహాయంతో అడ్డంగా తిప్పారు బోటుని. హుయ్ డయల్ పరీక్షగా చూసి, ఏదో విషపు పురుగును చూసినట్టు త్రుళ్ళిపడి "మైగాడ్" అన్నాడు కళ్ళు తేలవేస్తూ.

"ఏమయింది?" అంటూ సింగు, కిరణ్ ఒకేసారి డయల్‌లోనికి చూశారు. ఎర్రముల్లు ఎప్పటిలాగే 'డబ్ల్యు' మీదే ఉంది. బోటు తిరిగిన దిశనుబట్టి ప్రస్తుతం అది 'నార్త్' అంటే, 'ఎన్' అనే అక్షరంపై ఉండాలి!?

ఇద్దరి ముఖాలు పాలిపోయాయి.

"అ....అంటే అది పనిచెయ్యడంలేదా?" అడిగాడు

సింగు, కిరణ్ ని. అతడికి సముద్రం తలక్రిందులవుతున్నట్లు ఉంది.

"పడమర దిక్కుకే పోతున్నామనుకొని రాత్రంతా పిచ్చివాళ్ళలా తెడ్లు వేశాము. ఇప్పుడు ఎటువైపు ఉన్నామో ఎలా తెలుస్తుంది" అన్నాడు కిరణ్.

ఈ హడావిడికి విన్సెంట్, ఫ్లోరా నిద్రలేచారు. జరిగింది తెలుసుకొని కళ్ళు తేలవేశారు.

సింగ్ స్వగతంగా అన్నాడు. "నరరూప రాక్షసులయిన దొంగల బారినుండి తప్పించుకొన్నాం. కేవలం లైఫ్ బోటులో ఆరుగురం ఏ ప్రమాదం లేకుండా, ఇంత వరకూ ప్రయాణించడం అదృష్టమే అనుకొన్నాను. కానీ, ఇంత దూరం వచ్చాక దురదృష్టం ఈ రూపంలో ఎదురౌతుందని కలలో కూడా ఊహించలేదు ..."

పెద్దగా అలలు లేని ప్రశాంతమయిన సముద్రంలో నిశ్చలంగా ఉన్న బోటులో పెరిగిన గడ్డాలు, తుప్పలాంటి తలలు, పిచ్చి చూపులతో హఠాత్తుగా ఎదురయిన అతి పెద్ద ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలో ఎవ్వరికీ అర్థంగాక మౌనంగా ఉండిపోయారు ఆ ఐదుగురూ పావుగంటవరకూ.

సింగు కదిలాడు. ఇంజన్ స్టార్ట్ చేసి పోనిచ్చాడు. ఒక నిశ్చయానికి వచ్చినట్లు ఉంది అతడి ముఖం.

చిత్రంగా చూశారంతా. "సింగ్ ఏమిటి నువ్వు చేసేది?" తెల్లబోతూ అరిచాడు కిరణ్. వెనక్కి తిరిగి చెప్పాడు సింగు.

"కిరణ్ ప్రస్తుతం మనం ఏ దిశలో ఉన్నామో మనకే తెలియదు. అటువంటప్పుడు గుడ్డిగా ఎంత దూరమని నడుపుతాం దీన్ని?....

....ఎలాగూ మృత్యువు నోటికి చిక్కాం. సూర్యుని విచారించేకంటే, ఈ కాసేపయినా రిలీఫ్ గా ఉందండి."

ఆ సమాధానానికి కిరణ్ మాట్లాడలేక పోయాడు. మిగతా వాళ్ళవంక చూశాడు. దీనికి పెద్దగా వ్యతిరేకిస్తున్నట్లు కనిపించలేదు వాళ్ళు.

రాత్రి ఎనిమిది అయ్యింది—

బోటు పయనిస్తూనే ఉంది. ఇప్పుడు హ్యూయ్ నడుపుతున్నాడు. అంతా మౌనంగా ఉన్నారు. తమ ప్రయాణానికి గమ్యం లేదని తెలియడంతో, మాట్లాడడం కూడా వృధా అనిపించేటంతగా మారిపోయారు వాళ్ళు.

బోటు ఆగిపోయింది.

హ్యూయ్ కాసేపాగి వెనక్కి తిరిగి, అందరి ముఖాల్లోనికి చూశాడు చీకట్లో. రిజర్వ్ గా మిగిలివున్న ఇంధనం కూడా అయిపోయిందన్న నిజాన్ని జీర్ణించుకోడానికి ప్రయత్నిస్తున్నారంతా.

కొద్దిసేపు గడిచింది. ఉలిక్కిపడ్డారంతా!?

'టక్కు టక్కు' మని శబ్దం వినిపిస్తూంది. బోటు కదిలి పోతుంది. హ్యూయ్ చటుక్కున క్రిందికి వంగి చూసి, "ఓ.... వాటె వేల్?" అంటూ అర్చాడు.

కిరణ్, సింగు సీటిలోనికి చూసి కొయ్యబారి పోయారు!??

7

అర చెయ్యి పరిమాణంలో గల గుండ్రటి చేపలు వడ్రంగి పిట్టల్లా బోటుని చెక్కేస్తున్నాయి.

"వేగంగా కదలాలి ఇక్కడనుంచి" అని అరిచి తెడ్డు అందుకొన్నాడు కిరణ్. సింగు, కార్ల్ కూడా తెడ్లు అందుకొన్నారు.

చెక్కతో తయారు చేయబడిన తెడ్డు నీటిలోనికి మునీ మునగగానే దానిచుట్టూ, ఇరవై ముప్పై చేపలు చేరాయి. తెడ్డును కూడా కొరకడానికి ప్రయత్నిస్తున్నాయి.

అందరికీ ప్రాణాలమీద ఆశపోయింది ఆ చేపల్ని చూసి. మృత్యువు సమీపించిందని గ్రహించారు.

అప్పటికే బోటులోనికి నీళ్ళు వచ్చేశాయి. ఫ్లోరా వణికిపోతూంది. బిస్కెట్ ఖాళీ టిన్ను డబ్బాలు అణిచి రంధ్రాలకు అడ్డు పెట్టాలని ప్రయత్నిస్తున్నాడు. హుయ్ తెడ్డును బోటు అడుక్కి జొనిపి చేపల్ని చెల్లాచెదురు చేస్తున్నాడు.

కార్క్ వున్నచోట బోటు పూరిగా చీలిపోవడంతో, అయినా నీటిలోని జారిపోయాడతడు. చేపలు బోటు అడుగు భాగాన్ని తునాతునకలు చేసేశాయి. ముక్కలైపోయిన బోటునుండి యెవరి దారిన వాళ్ళు విడిపోయి కాళ్ళూ, చేతులు బలంగా తాటిస్తూ ఈదసాగారు. వ్రడంగి చేపలు వాళ్ళ తెరువుకు రాలేదు.

నీటిలోనికి దూకిన నాలుగు క్షణాల్లో మోకాలికి ఏదో గట్టిగా తగలడంతో ముందు బెదిరి, తర్వాత అది రాయి అని గ్రహించి, చేతికి దొరికిన ఆధారంతో పైకి ప్రాకాడు కిరణ్. చేపల బెడద వదిలిపోవడంతో ప్రాణం లేచి వచ్చినట్టుంది అతడికి.

చేతులతో తడిమాడు తనున్న ప్రదేశాన్ని.. అంతా మెట్టలా ఉందది. క్రమంగా దానిమీద వాలిపోయాడు.

మిగతా వాళ్ళ అరుపులు దగ్గరగా వినిపిస్తున్నాయి కిరణ్ కి.

"కిరణ్ యు ఆర్ సేఫ్?" సింగు కంఠం వినిపించింది

కాస్త సమారంగా. సింగుకూడా క్షేమంగా వున్నాడని గ్రహించి, అర్పి చెప్పాడు "హుష్." తర్వాత అందరూ కేకలతో క్షేమంగా వున్నట్టు తెలుపుకొన్నారు.

తెల్లవారే వరకు యెక్కడి వాళ్ళక్కడే వుండడం మంచిదని నిర్ణయించుకొన్నారు.

8

తెల్లవారింది—

ఒకటి రెండుచోట్ల చేపల కాట్లు తిన్న శరీరం, ఎండిన ఉప్పునీటికి సురసుర మండుతూంటే భారంగా కళ్లు విప్పాడు కిరణ్. కొద్దిగా ఎండ పడుతూంటే కళ్ళు చికిలించి చూశాడు. యేవో రంగురంగుల పక్షులు ఎగురుతున్నాయి పైన.

ఆసక్తిగా చుట్టూ చూశాడు. అతడు ఊహించినట్టే యేదో దీవి అది. దూరంగా పచ్చగా కనబడుతూంది దీవి. దానికి తీరంలో ఇసుక దిబ్బలు, వాటికి అనుకొని రాళ్ళ మిట్టలు. ప్రస్తుతం ఆ రాళ్ల మిట్టల పైనే ఉన్నారు వాళ్ళు. కాలువ ఎండిపోయినప్పుడు పైకి తేలే నత్తగుల్లల్లా కానిపించారు కిరణ్‌కి, రాళ్ళ గుట్టల పై ముడుచుకొన్న ఐదుగురూ.

బోటు ముక్కలు పక్కనే నీటిలో తేలుతున్నాయి. అదృష్టవశాత్తు బోటు రాతిగుట్టల దగ్గర ఆగిపోయింది. లేకపోతే విరిగిన బోటు ముక్కలకు బదులు, సముద్రంలో వాళ్ల శరీరం భాగాలు తేలుతూ వుండేవి.

కిరణ్ చిన్న గులకరాయితీసి, సింగుకి గురిచూసి విసిరాడు. ఫ్లోరాకి తగిలిందది. ఆమె సింగు ప్రక్కనే నిద్రపోతూంది. మెల్లగా కళ్ళు తెరిచిన ఫ్లోరా బలహీనంగా నవ్వింది కిరణ్‌ని చూసి. తర్వాత ఇద్దరూ కలసి మిగతా

వాళ్ళను లేపారు.

నిద్రమత్తు వదిలాక ఇసుక దిబ్బలు కూడా దాటి, దీవి లోనికి అడుగు పెట్టారంతా.

దీవిలో కూడా చాలావరకూ ఇసుకే వుంది. కొంత దూరం పోయాక రాళ్ళూ రప్పలూ తగిలాయి. చెట్లు విపరీతంగా వున్నాయక్కడ. వాటివల్ల ముందేముందో స్పష్టంగా కనిపించడం లేదు.

“ఇది ఒకవేళ ఏదో దేశానికి చెందిన ఐలాండ్ అయ్యుంటుంది” అన్నాడు హుయ్ చుట్టూ పరికిస్తూ.

“ఏ దేశానికి చెందిన ఐలాండ్స్ అయినా తీరంలోనే ఆ దేశానికి సంబంధించిన సింబల్స్ పాతి వుంటాయి. అలాంటివేమీ లేవంటే ఇదేదో, ఇంకా గుర్తింపబడని దీవి అయ్యుండాలి—” అన్నాడు సింగు.

గుర్తింపబడని దీవి అనగానే దాదాపు అందరినీ ఏదో తెలియని భయం క్రమ్మేసింది. నరమాంస భక్షకులైన ఆటవికులు, దేవతలకు బలులు ఇవ్వడాలు, ప్రాణాలు తీసే చిత్రవిచిత్రమైన జంతువులు గుర్తొచ్చాయి వాళ్ళకు. వాళ్ళు చూసిన సినిమాలు, చదివిన నవల్స్ అందుకు కారణం!

అందరికీ ఆకలిగా వుంది. “దేనినయినా వేటాడి ముందు కడుపు నింపుకొందాం — తరువాత మిగతా సంగతి” అన్నాడు విన్సెంట్.

“మరి నిప్పో?” అన్నాడు హుయ్.

“ఎవరయినా వేటాడగలిగితే, నిప్పు తయారుచేసే పూచీ నాది” అన్నాడు విన్సెంట్.

నవ్వి అన్నాడు కార్ల్ “చివరికి ఆటవికుల్లా మారబోతున్నామన్న మాట.”

అంత దుర్భర పరిస్థితిలోనూ మనస్ఫూర్తిగా నవ్వారంతా కార్ల్ జోక్‌కి.

విన్సెంట్ చెప్పింది కిరణ్‌కి నచ్చింది. రివాల్వర్ తీసి బుల్లెట్ కేస్ ఊడదీసాడు. టార్గెట్‌కి రాబోయే బులెట్ వెలుపలికి తీసి, దానిపై వున్న సన్నటి గ్లాస్ పొరను జాగ్రత్తగా వేరు చేసి, దూరంగా విసిరేసాడు. తర్వాత బులెట్ యథావిధిగా అమర్చాడు.

"ఏమిటది?" ఆసక్తిగా అడిగాడు సింగు.

"ఆ గ్లాస్‌తో పాటే పేలితే ఈ బులెట్ చాలా పవర్‌ఫుల్‌గా పని చేస్తుంది, దాదాపు యాసిడ్‌లా. అది తొలగిస్తే మామూలు బులెట్ ప్రభావంతోనే పేలుతుంది" వివరంగా చెప్పాడు కిరణ్.

"ఎన్ని రౌండ్లు పేల్చవచ్చు దీనితో?" అడిగాడు హుయ్.

"దాదాపు డభ్భైరెండు రౌండ్లు పేల్చవచ్చు" కిరణ్ చెప్పాడు.

తర్వాత పావుగంట వెతికారు అంతా కలిసి—

"అదిగో" అంది ఫ్లోరా దూరంగా చూపిస్తూ అంతా చూశారు. గోధుమ రంగులో వున్న పావురంలాంటి పక్షి, ఆకుల మధ్యనుండి అస్పష్టంగా కనబడుతుంది. పరీక్షగా చూసి గురిచూసి పేల్చాడు కిరణ్. అంతా ఊపిరి బిగబట్టారు. నిశ్శబ్దంగా రివాల్వర్ చివర మెరిసింది. మరుక్షణం పక్షి రెక్కలు టపటపలాడిస్తూ, నేలకూలింది.

"గుడ్ షూటింగ్" అన్నాడు హుయ్ కిరణ్‌ని మెచ్చుకోలుగా చూస్తూ.

విన్సెంట్ పొడవుగా వున్న రాళ్ళు వెదికి త్వరగా పొయ్యి తయారుచేశాడు. చకచకా పక్షిని కాల్చి స్వాహా

చేసేశారు ఆరుగురూ.

ఊం సాగా కబుర్లు చెప్పుకుంటూ కాస్త దూరంగా నడిచారు.

అంతే!?

దూరంగా కనిపిస్తున్న దృశ్యం చూసి, ఏదో ప్రపంచ వింత చూస్తున్నట్టు రెప్పవేయకుండా చూస్తూ విస్మయంగా నిలబడ్డారంతా—

9

దూరంగా ఎగుడు దిగుడుగా ఉన్న రాతిప్రదేశం మధ్య అత్యంత అధునాతనంగా నిర్మించబడి ఉన్నాయి బలమైన కట్టడాలు రెండు. వాటి ప్రక్కగా కాస్త పొట్టిగా, విశాలంగా రాళ్ళతో నిర్మించబడి ఉంది మరో కట్టడం.

"వాటీజ్ దిస్??" అన్నాడు కార్క్ విభ్రాంతిగా.

"ఇక్కడ ఎవరో నివసిస్తున్నారు!" అన్నాడు కిరణ్.

"ఇప్పుడేమిటి చెయ్యడం?" కట్టడాల వంకే చూస్తూ అన్నాడు సింగు.

కాస్త ఆలోచించి చెప్పాడు కిరణ్. "దగ్గర వెళ్ళి చూద్దాం. అక్కడి పొజిషన్ను బట్టి ఎలా ప్రొసీడ్ అవ్వాలో నిర్ణయించుకుందాం—"

నిర్మానుష్యమైన ఆ దీవిలో ఏకంగా భవంతులే దర్శనమిచ్చేసరికి, దిగ్భ్రమనుండి పూర్తిగా తేరుకోనకముందే ముందుకి నడిచారు.

ఎడంవయిపు కట్టడం ఎదురుగా చదునుగా ఉన్న బాటపైనుండి పాత జీప్ ఒకటి పెద్దగా శబ్దం చేసుకొంటూ వస్తూంది.

చటుక్కున తప్పుకొన్నారు చెట్లచాటుకి.

కిరణ్ జీప్ వంక చూశాడు. అతడి కనుబొమలు దగ్గరయ్యాయి. జీప్ డ్రైవ్ చేసుకొంటూ వస్తూన్న వ్యక్తిని పరీక్షగా చూసి తెల్లబోయాడు.

ముఖ్యంగా ఆ వ్యక్తి ఎద్దుకళ్ళు కిరణ్‌కి ఇంకా గుర్తున్నాయి. అతడు షిప్‌లో సీక్రెట్‌గా తన వాళ్ళకు మెసేజ్ అందించిన వ్యక్తి!?

కిరణ్ చటుక్కున సింగువైపు చూస్తూ "సింగ్, వీడినే నేను షిప్‌లో మెసేజ్ అందిస్తూండగా చూసి, అనుమానించింది" అన్నాడు. జీపు మలుపు తిరిగి పడివైపుకి వెళ్ళిపోయింది.

"అ....అంటే ఇది ఆ సముద్రపుదొంగల స్థావరమా?" కళ్ళు పెద్దవిచేసి అడిగాడు కార్క్.

"ఇంకా సందేహ మెందుకు? ఇదే వాళ్ల స్థావరం" అన్నాడు కిరణ్.

సింగు మౌనంగా వుండిపోయాడు. అతడి ముఖంలో విచారపు రేఖలు అలుముకొంటున్నాయి. "తిరిగి తిరిగి మళ్ళీ మృత్యువు కోరల్లోకే వచ్చామన్నమాట" అన్నాడు నీరసంగా.

కాసేపాగి ఒక నిర్ణయానికి వచ్చినట్టు చెప్పాడు కిరణ్ దృఢంగా "ప్రస్తుతం మనం చేయగలిగింది ఏమీ లేదు—ఆఖరి ప్రయత్నంగా వాళ్ళతో పోరాడదాం. గెలిస్తే ఎందరికో మేలుచేసిన వాళ్ళం అవుతాం, లేదంటే ఇక్కడ మన చావు ఎలాగూ తప్పదు."

"వాళ్ళతో మనం పోరాడ్డమా?" నమ్మలేనట్టు అడిగాడు విన్సెంట్.

"పోరాడడం అంటే వాళ్ళలా కత్తులు, గొడ్డళ్ల

తీసుకొని దొమ్మీగా కలబడదాం అని కాదు. ప్లాన్డ్ గా వాళ్ళందరినీ బంధిద్దాం. వీలయితే ఇండియాకు మెసేజ్ ఇచ్చి, మా ఇంటెలిజెన్స్ డిపార్టుమెంట్ ను రప్పిద్దాం" అన్నాడు కిరణ్.

కిరణ్ 'మా ఇంటెలిజెన్స్ డిపార్టుమెంట్' అనగానే సింగు తప్ప మిగతావాళ్ళు ఆశ్చర్యంగా చూశారు. అది గమనించి కిరణ్ నిట్టూర్చి చెప్పాడు "ఫ్రెండ్స్, నేనెవరో చెప్పవలసిన అవసరం వచ్చింది కాబట్టి చెబుతున్నాను" అంటూ, తన వృత్తి వివరాలు చెప్పాడు.

కిరణ్ ఏజంట్ అని తెలియగానే నలుగురికీ ఎక్కడ లేని ధైర్యం, ఉత్సాహం వచ్చింది. కిరణ్ అభిప్రాయంతో మనస్ఫూర్తిగా ఏకీభవించారు వాళ్ళు. "ముందు మనలో కొందరు వాళ్ళలా వేషాలు మార్చుకోవాలి" అన్నాడు కిరణ్.

గట్టిగా నవ్వాడు సింగు "కిరణ్, ఏమిటి నీ పిచ్చి! ఇదేమన్నా సినిమా అనుకొన్నావా, మనం వాళ్ళలా వేషాలు వేసుకోవడం, వాళ్ళను బంధించడం, ఇదంతా జరిగే పనా? ఒక వేళ వేషాలు వేసుకొన్నా వాళ్ళు మనల్ని గుర్తించరా?"

"సింగ్, ఇలాంటివి సినిమాలలోనే కాదు—పరిస్థితిని బట్టి నిజజీవితంలో కూడా జరుగుతాయి. వాళ్ళకు దుస్తుల పై నంబర్లు వేసి ఉండడం నాకు గుర్తు. నంబర్లు వేసే అవసరం వచ్చిందంటే వారి సంఖ్య ఎక్కువగా వుందన్న మాట. అటువంటప్పుడు మనం వేషాలు మార్చుకొంటే వాళ్ళు గుర్తించే అవకాశం ఏమాత్రం లేదు" అని, దూరంగా చూసి "అదిగో నలుగురు దొంగలు ఇటే వస్తు

న్నారు" అంటూ కిరణ్ రివాల్వర్ బయటికి తీసాడు.

'వి' షేపులో కత్తిరించిన నల్ల బనియన్‌లు వాటిపై తెల్లటి నంబర్లు వేసి ఉన్న నలుగురు దొంగలు రైఫిల్స్‌తో శివ్ వెళ్ళిన బాటగుండానే వస్తున్నారు.

రివాల్వర్ గురిచూసాడు కిరణ్. ఫ్లోరా కళ్ళు మూసుకొంది. నాలుగుసార్లు నొక్కాడు ట్రిగ్గర్. నలుగురూ కూలిపోయారు. గిలగిలా కొట్టుకొని ప్రాణాలు విడిచారు. వాళ్ళ తలలు చితికిపోయాయి బుల్లెట్లకు.

సరిగ్గా పావుగంటలో సింగు, హుయ్, కార్ల్, విన్సెంట్ నల్లగా మాసిపోయి వున్న దొంగల దుస్తులు ధరించారు. పెరిగిన గడ్డాలతో వాళ్ళు అచ్చం దొంగల లాగానే వున్నారు.

"నా దగ్గర రివాల్వర్ ఉన్నంతవరకూ నాకే ప్రమాదం రాదు. ఫ్లోరా నాకూడానే ఉంటుంది. ముందు మీరు భవంతిలోనికి వెళ్ళండి. జాగ్రత్తగా ప్రవర్తించండి" చెప్పాడు కిరణ్.

వాళ్ళు నలుగురూ క్రిందపడిన రైఫిల్స్ అందుకొని ఎడంవయిపు భవంతివైపు నడిచారు.

10

"నెంబర్ సిక్స్‌టీఎయిట్ ఎల్లుండి కెనడానుండి, ఒక ప్రయివేట్ షిప్‌లో నాలుగువందల టన్నుల గోధుమలు ఎక్స్‌పోర్టు అవుతున్నాయి. దానిని కొల్లగొట్టడానికి బెటాలియన్ ఫోర్తుని పంపుతున్నాము. వాళ్ళలో మీ నలుగురూ కూడా ఉన్నారు గనక బీ....ఎలర్టు" పూర్తిగా సైన్స్ మైక్ నిర్మించబడిన విశాలమైన ఆ పొడుగాటి గదిలో, వాళ్ళు నలుగురూ తప్ప ఎవ్వరూ లేరు. సౌండ్ ప్రూఫ్ ఏసీ గది అది.

గదిలో రష్యన్ చిత్రకారుడు గీసిన భయంకరమైన చైనీస్ డ్రాగన్ ఆయిల్ పెయింట్ తప్ప మరే ఫర్నిచరూ లేదు. వాళ్ళకు ఎదురుగా వున్న ఆ పెయింటింగ్ లో సూక్ష్మంగా వున్న ఆ రంధ్రాల ద్వారా వినిపించాయి ఆ మాటలు.

“ఎస్ బాస్” అన్నాడు రెండో ఆలోచన లేకుండా. తర్వాత నలుగురూ వెనుదిరిగారు.

“ఆగండి.”

ఎవ్వరికీ అడుగు ముందుకి పడలేదు. సింగుకి అర్థమైంది తను ‘ఎస్ బాస్’ అనగానే దొరికిపోయామని.

“మీకేమన్నా ట్రబుల్స్ వుంటే గైడ్ రూమ్‌కి వెళ్ళి వాటిని నివృత్తి చేసుకోండి.”

రిలీఫ్ గా నిట్టూర్చి “ఎస్ బాస్” అని ధైర్యంగా అని, వెనుదిరిగాడు సింగు. మిగతా ముగ్గురూ అతనితో పాటే కదిలారు.

కిరణ్ నుండి విడిపోగానే నలుగురికీ ఏం చెయ్యాలో తోచలేదు. ఎడం వైపు భవంతిలోనికి వెళ్ళగానే, ముందు ఒక క్లబ్ లాంటి ప్రదేశం దర్శనమిచ్చింది. రంగు రంగుల దీపాల మసక కాంతిలో, వెస్ట్రన్ సంగీతపు సందడిలో నల్లని సూటుల్లో వున్న కొందరు దొంగలు, తాగుతూ తింటూ అమ్మాయిలతో మజా చేస్తున్నారు.

ఇంతలో ఎర్రటి దుస్తులలో వున్న ఒక వ్యక్తి వచ్చి, వాళ్ళకు బాస్ నుండి కాల్ వచ్చిందని చెప్పగానే నలుగురూ గుండెలు దడదడలాడుతుండగా ఎర్ర దుస్తుల వ్యక్తి చూపినవైపు వెళ్ళారు.

“ఇప్పుడా గైడ్ రూమ్ తెలుసుకోవడం ఎలా?” గుసగుసగా అడిగాడు విన్సెంట్, సింగుని.

"నా అంచనా ప్రకారం గైడ్ రూమ్ రెండవ బిల్డింగ్ లోనే ఉండవచ్చు" చెప్పాడు సింగ్ సాలోచనగా.

"అక్కడికి వెళ్ళిచూద్దాం" అన్నాడు హ్యూమ్.

రెండవ భవంతిలోనికి ప్రవేశించారు. ఎక్కడచూసినా వాళ్ళ దుస్తులు లాంటివే ధరించినవాళ్ళు ఉండటంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా సంచరిస్తున్నారు వాళ్ళు. అక్కడక్కడా ఎర్ర దుస్తులు ధరించిన వ్యక్తులు వాళ్ళకు ఫార్మల్ గా 'విష్' చేస్తున్నారు. వాళ్ళు సర్వెంట్స్ అని అర్థంచేసుకున్నారు నలుగురూ. వాళ్ళకు దుస్తులపై నంబర్లులాంటివేమీ లేవు.

రెండవ భవంతిలోనికి ప్రవేశించి చాలా సేపయ్యింది. గైడ్ రూమ్ యెక్కడో తెలియడంలేదు వాళ్ళకి. కంగారు పడితే మరింత ప్రమాదమని తాపీగా వెతుకుతున్నారు.

"మిస్టర్ సిక్స్టీఎయిట్... బాస్ మీ నలుగురిని స్పెషల్ రూమ్ కి పిలిచారు" విశాలమైన హాల్లో రిసెప్షన్ లా వున్న గ్లాస్ అవతలనుండి ఎర్రదుస్తుల్లో వున్న సర్వెంట్ చెప్పాడు.

కాసేపు మౌనంగా వుండిపోయి తర్వాత తేరుకొని చెప్పాడు సింగ్. "మేము స్పెషల్ రూమ్ నుండే వస్తున్నాం. బాస్ మమ్మల్ని గైడ్ రూమ్ కి వెళ్ళమన్నారు."

"ఓ.కె, అలా కూర్చోండి అపరేషన్ పేపర్ ఇస్తాను" చెప్పాడా వ్యక్తి.

నలుగురూ సర్వెంట్ గమనించకుండా ఒకరి ముఖాల వంక మరొకరు ఆనందంగా చూసుకొన్నారు, గైడ్ రూం అదే అని తెలియడంతో.

11

కిరణ్ ఫ్లోరాతో రెండు బిల్డింగుల ప్రక్కనున్న రాతి కట్టడంలో గదుల్ని పరిశీలిస్తున్నాడు—

ఇద్దరూ ఆశ్చర్యంతో, విస్మయంతో తలమునకలవుతున్నారు—అక్కడున్న సంపద చూసి. టన్నులకొద్దీ ఆయిల్, ఇనుములాంటి ముడిపదార్థాలు, ఆహారపుపంటలు వున్నాయా చీకటి గదుల్లో. వాటిని తిరిగి బ్లాక్‌లో అమ్మేస్తున్నారని గ్రహించాడు కిరణ్.

మరో గదిలోనికి నడిచారు. చాలాతరహా చీకటిగా వుందక్కడ. రాళ్లతో కట్టింది కావడంవల్ల గబ్బుకంపు వేస్తూంది.

"కిరణ్" హెచ్చరించింది ఫ్లోరా.

ఆమె మాట పూర్తవ్వకుండానే ప్రమాదం గుర్తించాడు. మరో ఆలోచన లేకుండా, చటుక్కున కాళ్ల మీద కూలబడి వెనక్కి తిరిగాడు. అప్పటికే అతడి చేతిలో రివాల్వర్ సిద్ధంగా వుంది.

ఆ పద్ధతి దాదాపు అతడి ప్రాణాల్ని రక్షించింది—

కిరణ్ క్రిందికి కూలబడగానే, తళతళా మెరిసే గొడ్డలి అతడిపైనుండి రివ్వున దూసుకొనిపోయి చీకట్లో వున్న చెక్క స్తంభానికి నాటుకొని చిన్నగా కంపించసాగింది.

సరిగ్గా గొడ్డలి స్తంభానికి నాటుకొనేటప్పటికి, కిరణ్ రివాల్వర్ నిశ్శబ్దంగా పేలింది. బుల్లెట్‌కి ఎర్రదుస్తుల్లో ఉన్న సర్వెంట్ తల చితికిపోయింది. అప్పటికే అలాంటి నలుగురి సర్వెంట్స్ ప్రాణాలు తీసింది కిరణ్ రివాల్వర్.

గదిలో స్విచ్ బోర్డ్ కనబడ్డంతో స్విచ్ నొక్కాడు. దీపం వెలిగింది మసగ్గా. స్తంభానికి నాటుకొన్న గొడ్డలి

ఇంకా కంపిస్తూనే వుంది. గదిలో వందల సంఖ్యలో రైఫిళ్లు, హేండ్ గ్రెనేడ్లు, ఎక్స్‌ప్లోజివ్స్, గొడ్డళ్లు పేర్చబడి వున్నాయి. ఇంకా లోపలికి గదులు కనబడుతున్నాయి. .

"మై గాడ్! ఇంత సంఘ విద్రోహ చర్యను ఇక్కడిదే ప్రభుత్వం గుర్తించలేకపోవడం శోచనీయం" స్వగతంగా అన్నాడు కిరణ్.

వాటన్నింటిని బెదురుగా చూస్తుంది ఫ్లోరా.

కిరణ్ ఏదో గుర్తువచ్చి జేబులో తడిమాడు. ట్రాన్స్‌మీటర్ తగిలింది. బయటకు తీసాడు దానిని. నీటిలో తడిసిన తడి ఇంకా ఆరలేదు.

కాసేపాగి 'ఆన్' అన్న మీటను మృదువుగా వత్తాడు!?

రెండు క్షణాలు గడిచాయి!?

కిరణ్ కళ్ళు మెరిసాయి. ట్రాన్స్‌మీటర్‌లో ఎర్ర లైట్ వెలిగింది!

12

సింగు బృందం నలుగురికీ టైప్ చేసిన కాగితాలు అందజేయబడ్డాయి. అందులో 'దోపిడీదారులు ఏ సమయానికి బయల్దేరేది. ఏ దిశగా వెళ్ళేది' అన్నీ వివరంగా టైప్ చేసి వున్నాయి. సింగు పేపర్ వెనక్కి తిప్పాడు. అక్కడ గ్యాంగ్‌కి సంబంధించిన అసలైన పూర్తి వివరాలు వున్నాయి.

సింగు వాటిని శ్రద్ధగా చదువుతుంటే గ్లాస్‌లోనుండి గైడ్ సింగునే చూస్తున్నాడు!?

పూర్తిగా చదివాడు సింగు. మొత్తం అక్కడున్న

బాచ్‌లు నాలుగు. ఒక్కొక్క బాచ్‌వ ఎనభై మంది వరకూ దోపిడీదారులు వున్నారు. సర్వెంట్స్ అంతా కలిపి డబ్భైమంది వున్నారు.

“మీరు కామన్ హాల్లోనికి వెళ్ళండి” అన్నాడు గైడ్, చేతితో కొద్దిగా యెడంవయిపుకి చూపుతూ.

నలుగురూ అతడి చేతిని సూక్ష్మంగా పసిగట్టి, ఎడం వయిపుకి నడిచారు.

గైడ్ కనుబొమ్మలు దగ్గరయ్యాయి. “పేపర్స్ ప్లీజ్” అన్నాడు. నలుగురికి అర్థమయింది మౌనంగా పేపర్లు గైడ్‌కి అందించారు. గైడ్ వాటిని హీటర్‌లో వుంచి కాల్చేశాడు యథావిధిగా.

వాళ్ళు గైడ్ రూమ్ ఇంకా పూర్తిగా దాటలేదు. అలారమ్ నొక్కాడు గైడ్. అతడి మొహం ఎర్రగా కంది వుంది కోపంతో. ఎర్ర దుస్తుల్లో వున్న ఆరుగురు రైఫిల్స్‌తో గైడ్ ముందు ప్రత్యక్షమయ్యారు. గైడ్ వాళ్ళను రూమ్ దాటుతున్న సింగు బృందాన్ని చూపుతూ యేదో చెప్పి, ఒక కాగితం అందించాడు.

అవతలి రూమ్‌లోనికి ప్రవేశించగానే ఏం చెయ్యాలో తోచలేదు నలుగురికి. ఆ గదిలో అంతా ప్రశాంతంగా వుంది. నల్ల దుస్తుల్లో వున్న కొందరు యేవో యోగాసనాల్లాంటివి మెల్లగా వేస్తున్నారు. గదిలో అత్యంత ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి ట్యూబ్ లైట్లు.

ఇంతలో స్ప్రింగ్ డోర్ తోసుకొని ఆరుగురు సర్వెంట్స్ వాళ్ళను చుట్టుముట్టారు రైఫిల్స్‌తో.

నలుగురూ కొయ్యల్లా బిగుసుకొనిపోయి నిలబడిపోయారు. అంత త్వరగా తమ ఆట కడుతుందని అప్పటికి ఊహించలేదు వాళ్ళు. ఒక సర్వెంట్ నలుగురి

రైఫిల్స్ లాగేసి గదిలో ఓ మూలన వుంచాడు.

"వాట్ హేపండ్?" ఒక వ్యక్తి యోగాసనాలు ఆపి ప్రశ్నించాడు.

ఒక సర్వెంట్, గైడ్ వాళ్ళకు అందించిన ఆర్డర్ కాగితం చూపాడు. ఆ వ్యక్తి అది చూసి మారుమాట్లాడకుండా తన పనిలో నిమగ్నమయ్యాడు.

సర్వెంట్స్ నలుగురినీ గైడ్ ముందు హాజరుపరిచారు. నవ్వుతో చెప్పాడు గైడ్ "మీరు కాగితం తిరగవేసి చదివినప్పుడే నాకు అనుమానం వచ్చింది. ప్రతి కాగితం వెనుకా మా గ్యాంగ్ బయోడాటా యథావిధిగా వుంటుంది. అది సాధారణంగా ఎవరూ చదవరు ....

.... సెక్ట్స్, మిమ్మల్ని కామన్ రూమ్‌కి వెళ్ళమని కొద్దిగా సైగ చేశాను ఎడంవైపుకి. దాని ప్రకారం మీరు ఆలోచనా రహితంగా వెళ్ళిపోయారు. కామన్ రూమ్ కుడివైపున అని తెలియని వాళ్ళు మా గ్యాంగ్‌లో యెవరూ లేరు" అని సర్వెంట్స్‌వైపు చూసి "వీళ్ళని సెల్‌లో వుంచి బాస్‌కి విషయం పూర్తిగా తెలియపర్చండి—క్విక్" అన్నాడు.

సింగు, హుయ్, కార్ల్, విన్సెంట్ మొహాలు తెల్లగా పాలిపోయాయి.

సర్వెంట్స్ నలుగురినీ సెల్స్‌వైపు నడిపించుకుంటూ తీసుకొనిపోయారు.

13

భవంతులకు యెదురుగా వున్న విశాలమయిన రాతి ప్రదేశంలో కర్రలతో నిర్మించబడిన పొడుగాటి ఉరి కొయ్యకు వ్రేలాడదీయబడ్డారు ఆ నలుగురూ—

చుట్టూ రైఫిల్స్‌తో నిలబడ్డారు నల్లదుస్తులవ్యక్తులు.

నలుగురికీ ఎదురుగా, నలుగురు ఎర్రదుస్తుల వ్యక్తులు రైఫిల్స్ గురిపెట్టి పొజిషన్‌లో నిలబడ్డారు.

ప్రక్కనే సిమెంట్ కట్టిన పొట్టిగా వెడల్పుగా వున్న స్తంభం చివర అమర్చబడిన మైక్ నుండి వినిపిస్తూంది. "ఫ్రెండ్స్ సముద్రపు దొంగలకే మకుటంలేని మహారాజుగా నిలబడిన ఈ కొలాఫిస్ ఉక్కుపిడికిలిలాంటి స్థావరంలోనికి ఈ నలుగురు అమాయకులు చీమల్లా ప్రవేశించారు ...

....చీమలు మన వంటిమీద పాకుతూంటే ముందు మనకు తెలీదు. అవి కుట్టాక వాటిని మనం ఏం చేస్తాం? ఇప్పుడు వీళ్ళను అదే చేయబోతున్నాను నేను. మరో చిత్రమైన విషయం ఏమిటంటే వీళ్ళు, మనం కొల్లగొట్టిన ఇండియన్ పాసింజర్ షిప్ నుండి ఎస్కేప్ అయిన వాళ్ళేనని, ఆ రోజు దాడికి వెళ్ళిన బెటాలియన్ 'టు' కమేండర్ చెబుతున్నాడు....

....ప్రస్తుతం నేను ఒకటినుండి ఐదు అంకెలు లెక్కపెడతా. ఐదు పూర్తయిన మరుక్షణం మన సర్వెంట్స్, నలుగురినీ ఒకేసారి పైకి పంపిస్తారు. వాళ్ళ ప్రాణాలకు మనమిచ్చిన గడువు ఐదు అంకెలు. ఒక్కొక్క అంకె పూర్తవుతుంటే, సమీపించే మృత్యువును తలుచుకుని ఆలోచనా రహితంగా మన స్థావరంలోనికి అడుగుపెట్టినందుకు పశ్చాత్తాపపడాలి వీళ్ళు. అందుకే ఈ అంకెలు లెక్కపెట్టడం."

దూరంగా భవంతి మొదటి అంతస్థులో చిన్న బాల్కనీలో ఆయుధాలు ధరించిన నలుగురు సర్వెంట్స్ మధ్య, వీల్స్ చైర్ లో కూర్చుని బైనాక్యులర్స్‌లో చూస్తున్నాడు బాస్. కాళ్ళు లేవు అతడికి. అతనికి యెదురుగా

మాత్ పీస్ అమర్చబడి వుంది.

సింగుకి చెమట్లు కారిపోతున్నాయి. కిరణ్ యేమ య్యాడో అర్థంకావడం లేదతడికి. హుయ్, విన్సెంట్, కార్క్ ఎవరి దేవుళ్లను వాళ్ళు ప్రార్థించుకుంటున్నారు.

"ఒకటి" అన్నాడు బాస్.

నలుగురు బంధితులు కొద్దిగా గింజుకొంటున్నట్టు కదులుతున్నారు. వాళ్లకు యెదురుగా ఎత్తుగా దుస్తుల్లో వున్న సర్వెంట్స్, రైఫిల్స్ గురిపెట్టి భూతాల్లా కనబడు తున్నారు.

"రెండు"

నలుగురికీ గుండె వేగం చాలాతగా పెరిగింది.

"మూడు."

సింగు తల తిప్పి అటూ, ఇటూ చూస్తున్నాడు కిరణ్ యెక్కడయినా కనబడతాడేమోనని.

"నాలుగు."

ఎవ్వరికీ నోటమాట రావడంలేదు. కళ్లనీళ్ళు తిరుగు తుండగా గుటకలు మింగుతున్నారు.

సరిగ్గా అప్పుడే నలుగురూ వరసగా యెవరో తోసి నట్టు క్రిందికి వాలిపోయారు. చేతులకు కట్టిన తాళ్ళు తెగిపోయాయని గ్రహించారు. కిరణ్ గుర్తువచ్చాడు సింగుకి.

బాస్కి ఏం జరిగిందో అర్థంకావడంలేదు!?

సర్వెంట్స్ రైఫిల్ ట్రిగ్గర్ పై వేళ్ళు బిగిస్తున్నారు. బాస్ లెక్క పెట్టని ఐదు అంకె గురించి ఆలోచిస్తున్నారు వాళ్ళు. బంధవిముక్తులవుతున్న శత్రువుల్ని కంగారుగా చూస్తూ, తల తిప్పి బాల్కనీలోనికి చూస్తున్నారు బాస్ వైపు.

"వాట్స్ రాంగ్ — షూట్ ఆల్ ఆఫ్ యూ" ఆవేశంతో ఊగిపోతూ గట్టిగా అరిచాడు బాస్.

అప్పటికే సింగు బృందం ఎలర్టు అయి, గుబురుగా వున్న చెట్లలోనికి దూసుకొని పోయారు. చెట్లచాటున నుండి మెషిన్ గన్ శబ్దాలు వినిపించాయి. వాటి వెనుకగా సన్నగా శబ్దం చేసుకుంటూ, పద్దెనిమిది ఆర్మీ హెలికాప్టరు తూనీగల్లా ఎగురుకుంటూ వెలువడ్డాయి.

మెషిన్ గన్ బుల్లెట్స్‌కి, వెనక్కి తిరిగి సింగు బృందాన్ని షూట్ చెయ్యబోతున్న సర్వెంట్స్ ఎర్రదుస్తులు మరింత ఎర్రగా తడిసిపోయాయి. బ్లాక్ దుస్తులు ధరించిన బందిపోట్లు కూడా చాలావరకూ కూలిపోయారు.

మెషిన్ గన్‌లు పేలుతుండగానే హెలికాప్టరు క్రిందికి దిగాయి. అప్పటికి అదంతా ఆనందంగా చూస్తున్న కిరణ్, హెలికాప్టర్లను చూసి రెట్టించిన ఉత్సాహంతో కనిపించిన శత్రువునల్లా షూట్ చేస్తున్నాడు.

కొద్దిసేపు ఆ ప్రదేశమంతా తుపాకీ శబ్దాలతో మారుమ్రోగిపోయింది. బందిపోట్ల నందరినీ, బాస్‌తో సహా భారత ఇంటలిజెన్స్ డిపార్టుమెంట్ లొంగదీసుకుంది. కిరణ్, సింగ్, ఫ్లోరా, హుయ్, విన్సెంట్, కార్ల్ క్షేమంగా వున్నారు.

"సమయానికి వీళ్ళంతా ఎలా వచ్చారు?" ఆశ్చర్యంగా అడిగాడు సింగ్.

"ఇక పని చెయ్యదనుకొన్న ట్రాన్స్‌మీటర్, ఊహించని విధంగా తిరిగి పనిచేయడంతో అందరినీ రప్పించగలిగాను" నవ్వుతూ చెప్పాడు కిరణ్.

"వెల్ డన్ జంటిల్మన్, ఎవ్వరి కళ్ళల్లో పడని ఇంత

పెద్ద గ్యాంగ్‌ని ప్రాణాలతో సైగం మాకు పట్టిచ్చారు" అంటూ, ఆరుగురినీ అభినందించాడు ఇంటెలిజెన్స్ అధికారి భరద్వాజ. తర్వాత కిరణ్ వైపు చూసి "కిరణ్, ఒక పనిమీద పంపితే. మరో టస్క్‌లో ఇరుక్కున్నా ఇక్కడకూడా ఏజంట్ వనిపించుకున్నావు" అన్నాడు.

కిరణ్ మృదువుగా నవ్వి ఊరుకున్నాడు.

"రేపే మరో ఇండియన్ పాసింజర్స్ షిప్ ఆస్ట్రేలియా వెళుతూంది. మీ ఆరుగురినీ అందులో దింపుతాము. ఎవరి గమ్యాలకు వాళ్ళు చేరుకోవచ్చు" అన్నాడు భరద్వాజ.

ఆరుగురూ ప్రాణస్నేహితుల్లా ఒకరి కళ్ళల్లోనికి మరొకరు ఆనందంగా చూసుకున్నారు.

—: అయిపోయింది :—